ఎంఎల్‌ఎచే ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

బుట్టాయగూడెం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ఆదివారం ప్రారంభించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, నేతలు కరాటం రెడ్డిబాబు, కరాటం ఉమ రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నెముక అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ మండలంలోని రైతుల కరెంటు సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం కృష్ణ, మండల అధ్యక్షులు మెట్ల బుచ్చిరాజు, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

అడవి బిడ్డలపై..
'ప్రొటెక్షన్' పిడుగు..!

- ఏజెన్సీలో గిరిజనులపై కక్షగట్టిన రెవెన్యూ అధికారులు
- నోటీసులు, టైటిల్ వెరిఫికేషన్ లేకుండా ప్రొటెక్షన్ ఆర్డర్లు జారీ
- ఆర్‌డిఒ, తహశీల్దార్ల తీరు సర్వత్రా చర్చనీయాంశం
- బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పరిస్థితి దారుణం
- జిల్లా కలెక్టర్ ఇవ్వాల్సిన ఆర్డర్లు సైతం తహశీల్దార్లు ఇచ్చేస్తున్న పరిస్థితి
- గిరిజనేతర భూస్వాములకు ఏకపక్షంగా కొమ్ముకాస్తున్న బుట్టాయగూడెం తహశీల్దార్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏజెన్సీలో గిరిజనులకు ప్రత్యేక చట్టాలున్నాయి. గిరిజనులకు అండగా ఉండేందుకు ఐటిడిఎ వంటి సంస్థలను నెలకొల్పారు. అధికారులు మాత్రం గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తూ ఏజెన్సీలో గిరిజనేతర భూస్వాములకు కొమ్ముకాస్తున్న పరిస్థితి ఉంది. జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. జిల్లా కలెక్టర్ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు సైతం తహశీల్దార్లు తీసుకుంటూ అడవి బిడ్డలపై నిరంకుశ ధోరణితో ముందుకు సాగుతున్నారు. ఎల్‌టిఆర్ భూముల సమస్యలపై రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా తయారైంది. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప అడవిబిడ్డలకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు.


GOVERNMENT OF ANDHRA PRADESH
REVENUE DEPARTMENT

Roc.No.585/2024/A
Dated:11.12.2024

O/o the Tahsildar,
Buttaigudem Mandal

From
Sri P.V.Chalapathi Rao,B.Com,
Tahsildar & Executive Magistrate
Buttaigudem Mandal

To
The Station House Officer
Buttaigudem Police Station
Buttaigudem Mandal.

Sub:- Agency Land Disputes – Eluru District – Jangareddigudem Revenue Division – Koyyalagudem Mandal – Koyyalagudem- Petition filed by Smt Kurru Nagamani W/o Satyanarayana – Requested to provide police aid for an extent Ac.2.50cts in R.S.No.41-2 in Jainavarigudem Revenue Village and Mandal against the obstructors i.e.,Soyam Sreenu,Paddam Bhaskhararao and others – For take necessary action – Reg.

Ref:- 1. Petition filed by Smt Kurru Nagamani W/o Satyanarayana,Koyyalagudem Village of Buttaigudem Mandal, dated:15-11-2024
2. This Office in Roc.No.585/2024/A, dated:09/12/2024.
3. Memo forwarded by the Revenue Divisional Officer, Jangareddigudem, dated:11/12/2024.

I invite attention to the reference 1st cited, wherein Sri Kurru Nagamani W/o Satyanarayana resident of Koyyalagudem Village of Koyyalagudem Mandal has filed a petition in this Tahsildar Office,Buttaigudem with a requested to provide police protection for the land an extent of Ac.2.50cts in R.S.No.41-2 situated in Jainavarigudem Revenue Village of Buttaigudem Mandal against the obstructors i.e., Soyam Sreenu,Paddam Bhaskhararao,Irpa Annapurna,Paddam Gangajala and others are resident of Janivarigudem Village of Buttaigudem Mandal.

The Revenue Divisional Officer, Jangareddigudem has requested to take necessary action on the request of the Petitioner as per the available records, field enquiry and as per law and rules in vogue in the reference 3rd cited.

I submit that, as per the report of the Village Revenue Officer, Jainavarigudem Village and Mandal Revenue Inspector, Buttaigudem Mandal is here under:

రెవెన్యూ అధికారులు ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్ కాపీ

ఏజెన్సీలో ఎల్‌టిఆర్ (షెడ్యూల్డ్ ఏరియా ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్) భూముల విషయంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లు గిరిజనుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎటువంటి వెరిఫికేషన్, నోటీసులు లేకుండా నిరంకుశంగా ముందుకు సాగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనేతర భూస్వాములకు ఇష్టానుసారంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చేస్తూ గిరిజనులపై పోలీసులను ఉసిగొల్పుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ గిరిజనులు నెత్తినోరు మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఏదైనా ఎల్‌టిఆర్ భూమిపై సమస్య వస్తే ఆర్‌డిఒగాని, తహశీల్దార్‌గాని వెంటనే ఆ భూమి సాగులో ఉన్న రైతులకు నోటీసులివ్వాలి. ఇరువురిని పిలిపించి టైటిల్ వెరిఫికేషన్ చేయాలి. ఈ టైటిల్ వెరిఫికేషన్ అనేది 1934 నుంచి ఉన్న రికార్డులను పరిశీలించాలని చట్టాలు సైతం చెబుతున్నాయి. రెవెన్యూ అధికారులు అటువంటి ప్రక్రియ చేపట్టడం లేదు. గిరిజనేతర భూస్వాములు గిరిజనులపై ఫిర్యాదు ఇవ్వడమే ఆలస్యమన్నట్లుగా వెంటనే ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు. దీంతో గిరిజనేతర భూస్వాములు రెచ్చిపోయి పంటలను ధ్వంసం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వడంతో పోలీసులు గిరిజనేతర భూస్వాములకు అండగా నిలబడుతున్న పరిస్థితి ఉంది. అదేమని అడిగితే గిరిజనులపై ఇష్టానుసారంగా కేసులు బనాయిస్తున్న పరిస్థితి. వృద్ధులపై సైతం కేసులు పెట్టి వేధిస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలో ఇనుమూరు గ్రామంలో గిరిజనుల సాగులో ఉన్న దాదాపు 80 ఎకరాలకు, మర్లగూడెంలో 27 ఎకరాలకు, జైనవారిగూడెంలో 40 ఎకరాలకు, రెడ్డిగణపవరంలో 20 ఎకరాలకు, కట్టుపల్లిలో 25 ఎకరాల ఎల్‌టిఆర్ భూములపై ఆర్‌డిఒ, తహశీల్దార్ ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చేశారు. ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చిన భూములు కొన్ని కోర్టుల్లో సైతం ఉండటం గమనార్హం. జైనవారిగూడెం భూములకు సంబంధించి 2003లో గిరిజనులకు అనుకూలంగా జడ్జిమెంట్ ఇచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారని గిరిజనులు చెబుతున్నారు. జీలుగుమిల్లి మండలం సిరివారిగూడెంలో 20 ఎకరాలకు సంబంధించి ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చిన పరిస్థితి నెలకొంది.

జిల్లా కలెక్టర్ నిర్ణయాలూ వీరే తీసుకుంటారా?

నిబంధనల ప్రకారం ఏజెన్సీలో ఎల్‌టిఆర్ భూములపై ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వాలంటే ఎకరా విలువ రూ.500లోపు ఉంటే తహశీల్దార్, రూ.ఐదు వేల వరకూ ఆర్‌డిఒ ఇవ్వొచ్చు. అంతకుమించి ఉంటే మాత్రం జిల్లా కలెక్టరే ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆర్‌డిఒ, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లు ఇస్తున్న ఆర్డర్లు నిబంధనలకు విరుద్ధమని తెలుస్తోంది. తహశీల్దార్లు నిబంధనలు పాటించకుండా తామే జిల్లా కలెక్టర్ అన్నట్లు ఆర్డర్లు ఇచ్చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. అంతేకాకుండా ఏ అధికారి ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వాలన్నా ముందుగా నోటీసులిచ్చి, టైటిల్ వెరిఫికేషన్ జరపాలి. నిబంధనల ప్రకారం 1934 నుంచి రికార్డులు పరిశీలించాల్సి ఉండగా అలాకాకుండా పదేళ్లలోపు రికార్డులు పరిశీలించి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఆన్‌లైన్ వచ్చిన తర్వాత గిరిజనేతర భూస్వాములు అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్న దాఖలాలు కోకోకొల్లలు. రెవెన్యూ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా గిరిజనులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఏజెన్సీలో ఎల్‌టిఆర్ భూములపై దాదాపు 30 వేల కేసులు నమోదవ్వగా, 20 వేల కేసులకు సంబంధించిన తీర్పులు గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా వచ్చినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అధికారులు ఇష్టానుసారంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇవ్వడంతో గిరిజనులు పంటను కోల్పోవడంతోపాటు కేసులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- పది సూత్రాల స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు జిల్లా యంత్రాంగం కషి
- రైతులకు రూ.4,435 కోట్లు పంట రుణాలు
- వ్యవసాయంలో 15 శాతం, పారిశ్రామికంగా 20 శాతం వద్ధిరేటుపై ప్రణాళిక
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం
- గణతంత్ర దినోత్సవ సందేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పది సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సాధించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని, వ్యవసాయ ప్రధానమైన ఏలూరు జిల్లాలో వ్యవసాయరంగంలో 15 శాతం, పారిశ్రామికాభివృద్ధిలో 20 శాతం వద్ధిరేటు సాధించే దిశగా ప్రణాళిక రూపొందించామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగంతోపాటు ఉద్యాన, ఆక్వా, పాడి పరిశ్రమ వంటి అనుబంధ రంగాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లాస్థాయిలో ఆడిట్ టీమ్‌ను ఏర్పాటుచేశామని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్యను తెలుసుకుని పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో గ్రామాల అభివృద్ధికి ప్రతి జిల్లా, మండల అధికారులు ఒక గ్రామాన్ని దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రైతాంగానికి రూ.4,435 కోట్లు పంట రుణాలుగా అందించామని, పిఎం కిసాన్ కింద లక్షా 30 వేల 359 మంది రైతులకు రూ.27 కోట్లు అందించామన్నారు. కౌలురైతుల సంక్షేమంలో భాగంగా 75,560 మంది కౌలురైతులకు పంట సాగుదారుల హక్కు పత్రాలు జారీ చేస్తున్నామని, రూ.143 కోట్లు రుణాలుగా అందించామని చెప్పారు.

సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, జెసి ధాత్రిరెడ్డి

ధాన్యం కొనుగోలు, చెల్లింపుల్లో జిల్లాదే తొలిస్థానం

ఖరీఫ్‌లో 228 రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 41,856 మంది రైతుల నుండి 3,32,337 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.765.35 కోట్లు సొమ్ము 24 గంటల్లోగా రైతుల ఖాతాలకు జమ చేసి, రాష్ట్రంలో ముందుస్థానంలో ఉన్నామన్నారు. జిల్లాలోని ఉద్యాన రైతులు వినూత్నంగా డ్రాగన్ ఫ్రూట్, యాలకులు, దాల్చినచెక్క వంటి రకాలను సాగు చేయడం శుభపరిణామమన్నారు. జిల్లాలో లక్షా 68 వేల ఎకరాల్లో 12 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులతో దేశంలోనే ఏలూరు జిల్లా ముందుస్థానంలో ఉందన్నారు. నూజివీడు మామిడికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని, ఆ ఇమేజ్ మరింత పెంచేలా మరింత నాణ్యమైన దిగుబడికి రైతుల ఉపయోగార్థం రూ.30 కోట్లతో నూజివీడు మార్కెట్ యార్డును అభివృద్ధి చేయనున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు అందించిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూ.789 కోట్లు నిర్వాసితుల ఖాతాలకు జమ చేసిందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేస్తామన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధి కోసం ల్యాండ్‌బ్యాంకు నిర్వహిస్తూ 1600 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లాలో రోడ్ల పరిస్థితిని మెరుగుపరుస్తున్నామని, ఈ నెలాఖరునాటికి గుంతలను పూర్తిగా పూడ్చి గుంతలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతున్నామన్నారు. 682 కిలోమీటర్ల రహదారులకు రూ.98 కోట్లతో మరమ్మతులు చేపట్టామన్నారు. ద్వారకాతిరుమలలో పైలెట్ ప్రాజెక్టుగా 750 కిలోవాట్ల సామర్థ్యంగల సోలార్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, వివిధ శాఖల శకటాల ప్రదర్శన అందరినీ ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఎఫ్‌ఒ శుభకరణ్, ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ: గణతంత్ర దినోత్సవ వేడుకలను జనసేన కార్యాలయంలో ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆదివారం జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం మనదేనన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశాన్ని నిలపడంలో రాజ్యాంగం మహోన్నత పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కన్వీనర్ రాఘవయ్యచౌదరి, నాయకుడు నారా శేషు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం: స్వేచ్ఛా భారతావనిని నిర్మించిన అంసఖ్యాక మహోన్నత వీరులు చిరస్మరణీయులని ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలో పలుచోట్ల జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుడి హృదయంలో గణతంత్ర దినోత్సవం పట్ల ప్రత్యేక స్థానం ఉందన్నారు. డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి వెంకటేశ్వరరావు, తహశీల్దారు కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఇ.శ్రీనివాస్, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పవన్‌కుమార్, అటవీశాఖ కార్యాలయంలో అటవీ క్షేత్రాధికారి ఎస్‌కె.వలీ, పంచాయతీ వద్ద సర్పంచి పాడుం పుష్ప, వై.కొండలరావు, పోలవరం మెయిన్ బజార్‌లో ఉప సర్పంచి కోరశిక శ్రీనివాస్ పతాకావిష్కరణలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎఒ శ్రీనివాస్, బొరగం వెంకటలక్ష్మి, జల్లేపల్లి వెంకటనరసింహారావు, మాజీ ఉప సర్పంచి మంగిన కొండ, పాదం ప్రసాద్, గునపర్తి చిన్ని, సోమరౌతు అనిత కుమారి, ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కదంతొక్కిన రైతులు, కార్మికులు

- కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై నిరసన ప్రదర్శన
- వ్యవసాయ కార్పొరేటీకరణ నూతన చట్టాలను రద్దు చేయాలి
- ఏప్రిల్ 1 నుండి కార్మిక కోడ్‌ల అమలు నిలుపుదల చేయాలి
- రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఏలూరులో రైతులు, కార్మికులు కదం తొక్కారు. రిపబ్లిక్ డే సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపులో భాగంగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వసంతమహల్ సెంటర్ వరకు ప్రదర్శన చేపట్టారు. కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, వ్యవసాయ కార్పొరేటీకరణ విధానాలు ఆపాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి రైతుసంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం (స్ఫూర్తి భవనం) రాష్ట్ర కార్యదర్శి డి.ప్రభాకర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కె.భాషా, అఖిల భారత ఐక్య రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె.గౌస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసడాంగే, ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు తలారి ప్రకాష్, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ ఎస్.రాజశేఖర్ తదితరులు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ రైతాంగానికి క్షమాపణ చెప్పి రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి అమలు చేసేందుకు, వ్యవసాయాన్ని కార్పొరేటీకరణకు రైతు మెడకు ఉరితాడుల్లా వ్యవసాయ సాంకేతిక చట్టం, సహకార చట్టం వంటి నూతన చట్టాలు తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం గాలికొదిలిసిందని విమర్శించారు. రైతు ఉద్యమానికి తలొంచి రద్దు చేసిన చట్టాల్లోని విధానాలతోనే తిరిగి కొత్త చట్టాలను తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం కిందకు తెచ్చేందుకే కొత్త చట్టాలని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానమే ఇంక ఉండదన్నారు. ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకునేలా మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీములు ఇకపై ఉండవన్నారు. ప్రభుత్వాల కొనుగోళ్లు ఉండవని, ఆహార భద్రత చట్టానికి తావు లేదని అన్నారు. ఇప్పటికే కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని తూట్లు పొడుస్తోందని, విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తోందని, ఏప్రిల్ 1 నుండి నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు పూనుకుందని చెప్పారు. రైతాంగ పోరాటాలకు తలొగ్గి చర్చలకు కేంద్రం అంగీకరించిందని, ఈ చర్చల్లో ప్రస్తుతం తెస్తున్న చట్టాలు రద్దు చేసి రైతుల, కార్మికుల డిమాండ్లు ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక, రైతుసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నేతలు జి.రాజు, బి.సోమయ్య, జి.రవికిషోర్, వైఎస్.కనకారావు, జె.గోపీ, కె.పోశమ్మ, కె.విజయలక్ష్మి, ఎ.జాన్‌బాబు, వివిధ రైతు, కార్మిక సంఘాల నేతలు కట్టా భాస్కరరావు, కోన శ్రీనివాసరావు, యర్రా శ్రీనివాసరావు, గడసాల రాంబాబు, దూళ్ల వీరినాయుడు, విజయ్, మీసాల రమణ, త్రినాథ్, గురనుపూడి నాగేశ్వరరావు, జనార్ధన్, జె.రమణ, దుర్గారావు, అన్నవరం, అప్పారావు, భూపతి, కోరాడ అప్పారావు, సింహాచలం, రెడ్డి శ్రీనివాస్‌డాంగే, రాయంకుల లక్ష్మణరావు, పుప్పాల కన్నబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, కడుపు కన్నయ్య, పుప్పాల శ్రీనివాసరావు, వి.శ్యామల, ఎం.విజయ, బల్ల కనకదుర్గారావు, బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాన్, ఎ.లక్ష్మీ ఇందిరా, జి.స్వాతి, బరగడ పోతురాజు, వై.వెంకటేశ్వరరావు, కొక్కిరిపాటి ఆనంద్, సిరికొండ రామారావు, ముప్పిడి రాజారత్నం, పి.సుబ్బారావు, ఎం.పోశమ్మ, ఎస్.గంగాదేవి, కె.సుందరరావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

పోలవరం: రైతు మెడకు ఉరితాడు బిగించే కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలను రద్దు చేయాలని, ఏప్రిల్ 1 నుండి నాలుగు లేబర్ కోడ్‌ల అమలు నిలుపుదల చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా- కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా రైతుకూలీ సంఘం (ఎపి), ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాల్ దగ్గర నుండి బస్టాండ్ మీదుగా పోలవరం ప్రధాన రోడ్లగుండా ప్రదర్శన నిర్వహించి, ఏటిగట్టు సెంటర్లో ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమాన్నుద్దేశించి కుంజం రామారావు, సవలం రాంబాబు మాట్లాడారు. నేతలు దాడి రాముడు, మిడియం రవిదొర, పోసిరావు నాయకత్వం వహించారు.

జీలుగుమిల్లి: కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి దుర్గారావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు సిరిబత్తుల సీతారామయ్య, కొండలరావు, నిర్మల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



బహుమతుల ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న నిర్మల

సృజనాత్మకత పెంపొందుకు బాలోత్సవం దోహదం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆట పాటలతో గడపాల్సిన బాల్యాన్ని చిదిమేసి, చిన్న వయసులోనే వారికి పుస్తకాలు అనే మేత వేసి, మార్కులు అనే గుడ్లను బలవంతంగా పిండుతున్న నేటి విద్యా వవస్థలో బాలోత్సవం పిల్లల సంబరాలు పేరిట వేలాదిమంది విద్యార్థులను ఒకచోట చేర్చి, వారిలోని సృజనాత్మకతను, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నం చేయడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. శుక్ర, శనివారాల్లో ఏలూరు సమీపంలోని వట్లూరులో సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో నిర్వహించిన హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాల్లో విజేతలకు ఆదివారం స్థానిక సిఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సభకు బాలోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ బాలోత్సవంలో కొత్తవారిని భాగస్వాములను చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కొత్తగా మైక్రో ఆర్ట్స్‌లో కూడా పోటీ పెట్టామన్నారు. రెండు రోజుల్లో సుమారు 14 వేల మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసొచ్చారని, వారందరికీ ఎలాంటి లోటూ రాకుండా భోజనం ఏర్పాట్లు చేసిన సత్యనారాయణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆహ్వాన సంఘం ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సిఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ కెఎ.రామరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ల సతీష్, వేమా సురేష్ తదితరులు మాట్లాడుతూ 2019లో మొదటిసారిగా కేవలం 3200 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ బాలోత్సవం నేడు 14 వేల మందికి వేదిక కావడం సామాన్య విషయం కాదన్నారు. దేశ భవిష్యత్తు నేటి విద్యార్థులపైనే ఉందన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ప్రేమ ఆప్యాయతలతోపాటు క్రమశిక్షణ కూడా నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. టీవీ, మొబైల్ ఫోన్లకు పిల్లల్ని దూరంగా ఉంచాలని తెలిపారు. సామాజిక స్పృహ లేకుండా కేవలం మార్కులతో ఏ విద్యార్థీ ఉన్నత స్థానానికి చేరుకోరని, అలాంటి సామాజిక స్పృహ విద్యార్థుల్లో పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని అన్నారు. అనంతరం ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి, ఇరిగేషన్ డిఇ డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు రూపొందించిన భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఈ సభలో ఆవిష్కరించి అందరికీ అందించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 69 అకడమిక్, కల్చరల్ అంశాల్లో కిడ్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ కేటగిరీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కల్చరల్ అకడమిక్ అంశాల కన్వీనర్లు ముస్తఫా ఆలీ, ఎస్.కస్తూరిరావు, డి.హేమసుందర్, పి.మంగరాజు పలువురు ఆహ్వాన, నిర్వహణ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు జిల్లా అధికారులకు పురస్కారాలు

కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డిఆర్‌ఒ విశ్వేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ సోల్మన్‌రాజ్, ఎఎస్‌పి సూర్యచంద్రరావు, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు

పురస్కారం అందుకుంటున్న డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీలక్ష్మి, డిఎఫ్‌ఒ శుభకరణ్, డ్వామా పీడీ సుబ్బారావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, హౌసింగ్ జిల్లా అధికారి సత్యనారాయణ, వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌భాషా, ఎల్‌డిఎం నీలాద్రి, విజిలెన్స్ అధికారి శ్రీరాంబాబు

దళిత ఉద్యమ నాయకులపై నిర్బంధం సిగ్గుచేటు

ప్రజాస్వామికవాదులు ఖండించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గణతంత్ర దినోత్సవం రోజున దళిత ఉద్యమ నాయకులపై పోలీసుల నిర్బంధం సిగ్గుచేటని, ప్రజాస్వామిక వాదులందరూ దీనిని తీవ్రంగా ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ పీఠికను వదవడని ఒక పక్క చెబుతుంటే విజయవాడ నగర పోలీసులు మాత్రం అంబేద్కర్‌కు నివాళులర్పించి రాజ్యాంగ పీఠిక చదువుతామంటే పర్మిషన్ లేదంటూ కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రిని గృహనిర్బంధం చేయడం, నగర నాయకులు నటరాజ్, క్రాంతిబాబులను అరెస్టు చేసి మాచర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమని తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు ఆ రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పిస్తామంటే నిర్బంధించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడతామని, నిర్బంధాలను, దౌర్జన్యాలను సాగనివ్వమని చెప్పి అధికారంలోకొచ్చి ఆరు నెలలు కాకుండానే ఈ విధంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. దళిత నాయకులను చట్ట విరుద్ధంగా అరెస్టులు చేసిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు.

బాలోత్సవంలో చెక్కపల్లి శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముసునూరు

ఏలూరులో జరిగిన బాలోత్సవంలో మండలంలోని చెక్కపల్లి చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ మరియు నాగరాజు తెలిపారు. ఆ పాఠశాల విద్యార్థులు జె.శాంతి భీమ్ వేషంలో, ఎస్.కె.ఆశిక్ వివిధ వేషధారణ, టి.రామ్‌కిరణ్ మ్యాప్ పాయింటింగ్, ఎ.చంద్రిక వర్ణని కథలు చెప్పడం తెలుగులో, కె.సహని ఫ్యాన్సీ డ్రెస్, సిహెచ్.దివ్య ఏకపాత్రాభినయం, సందేస్ వివిధ వేషధారణ సోలో, వై.ఆస్విను సందేశాత్మక పాటలు నృత్యం ఇలా పలు బృందాలుగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు.

మాజీ ఎంఎల్‌ఎకు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు తల్లి మల్లమ్మ శనివారం మృతి చెందారు. స్వగ్రామం దుద్దుకూరులో ఆదివారం నిర్వహించిన తెల్లం బాలరాజు తల్లి అంత్యక్రియల్లో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజును పరామర్శించారు. మాజీ ఎంఎల్‌ఎను కరటం రాంబాబు, కరటం రెడ్డిబాబు, కరటం ఉమామహేశ్వరరావు, కరటం సాయి చంద్రమోహన్, వైసిపి నాయకులు, టిడిపి నాయకులు, జనసేన నాయకులు పరామర్శించారు.

యానాది కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని యానాది కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్, ఎస్ఎస్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. విజయవాడ నగరానికి చెందిన ఐ, జనరల్ కేర్ ఎస్ఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. అత్యవసర విభాగ వైద్యులు ఎస్.నాయక్ రఫూల్, కంటి చికిత్స నిపుణులు డాక్టర్ జమీ రవి షాహిన్, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ క్యాంపులు నూజివీడు మండల పరిధిలోని యానాదుల కాలనీ గ్రామ పరిసర ప్రాంతాలలోని ప్రజలు వినియోగించుకున్నట్లు తెలిపారు. మరికొన్ని క్యాంపులు నూజివీడు నియోజకవర్గ పరిసరాలలో నిర్వహిస్తామని, పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు తమ ట్రస్ట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు 9640324266 సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు లేగ దూడల అందాల పోటీలు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో కొనసాగుతున్న పశు ఆరోగ్య శిబిరాల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీన ఎం.ఎం.పురంలో లేగ దూడల అందాల పోటీలు నిర్వహించనున్నట్లు పూళ్ల పశు వైద్యశాల వైద్యులు మున్నంగి హరికృష్ణ తెలిపారు. మండలంలోని రెండు వేర్వేరు బృందాల ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. దీనిలో భాగంగా సోమవారం మల్లవరంలో గుండుగొలను పశు వైద్యశాల వైద్యులు ఐ.రమ్యశ్రీ పశు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారన్నారు. దీనిలో భాగంగా పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పేద మైనారిటీ కుటుంబానికి చెందిన ఈదులగూడెం గ్రామానికి చెందిన షేక్ రఫియా బేగం వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేయడం పట్ల బాధితురాలి తల్లి షేక్ లాల్ బీ, ఈదులగూడెం గ్రామ సర్పంచి చిట్నేని విజయకుమార్ శేషగిరిరావులు మంత్రి పార్థసారధికి కృతజ్ఞతలు తెలిపారు. ఈదులగూడెనికి చెందిన షేక్ రఫియా బేగం తలసేమియా వ్యాధితో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుంది. రఫియా బేగం ది గ్రామంలో ఇదే ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది. ఆ పాప ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన పరిశీలించారు. ఆ పాపకు తండ్రి లేకపోవటంతో తల్లి సంపాదనతోనే కుటుంబాన్ని పోషించడంతో లాల్ బీ పడుతున్న ఆవేదనను గమనించిన ఆ గ్రామ సర్పంచి చిట్నేని విజయకుమార్ శేషగిరిరావు ఆ సమస్యను ఆ పాప తల్లితో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మానవతా దృక్పథంతో స్పందించిన మంత్రి సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.3,02,515 మంజూరు చేయించడం పట్ల ఆ పాప తల్లితో పాటు ఈదులగూడెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

'పోతునూరు వాసులకు అండగా ఉంటాం'

ప్రజాశక్తి - దెందులూరు

పోతునూరు గ్రామ ప్రజలకు ప్రతి విషయంలోనూ వెన్నుదన్నుగా ఉంటామని ఏలూరు రోమన్ క్యాథలిక్ మేత్రాసనం, విశాఖ పట్నం అగ్ర పీఠాధిపతి డాక్టర్ జయరావు పొలిమెర చెప్పారు. పోతునూరు నిత్య సహాయ మాత వద్ద వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మహాఘనంగా వహించిన జయరావు పొలిమెర ఆశీర్వాదంతో పోతునూరు గ్రామం ఆర్‌సిఎం చర్చిలో దివ్యబలి పూజ నిర్వహించారు. పోతునూరు విచారణ గురువు రెవ ఫాదర్ ఆర్.తంబి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు పూజాబలితో ముగించారు. ఆఖరి రోజైన ఆదివారం బిషప్ జయరావు పొలిమెర పోతునూరు గ్రామంలో దివ్యబలి పూజను నిర్వహించారు.

'మానవత'కు దాతల సాయం అభినందనీయం

భీమడోలు: స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు దాతలు తమ వంతు సహకారాన్ని అందించడం అభినందనీయమని ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధరరావు, అధ్యక్ష రాంబాబు తెలిపారు. శాఖ నెలవారీ కార్యవర్గ సమావేశం పోలసానిపల్లిలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి శాఖ అధ్యక్షులు జి.సీతారామాంజనేయులు, చైర్మన్ జి.నూకరాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సర్పంచి షేక్ రహీమా బేగం హసేనా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ చేపట్టనున్న వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం శాఖ తరఫున శవాలను భద్రపరిచేందుకు మూడో శీతలీకరణ ఫ్రీజర్ కొనుగోలుకు తీర్మానించారు. దీనిపై స్పందించిన సర్పంచి తన అత్తమామలు సమీ ముస్సిసా బేగం, కరీముల్లా పేర దా.పవలే విరాళాన్ని అందించనున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత సంస్థ తరపున వికలాంగుడికి ప్రతిభావంతునకు కేన్సర్ రోగికి చికిత్స నిమిత్తం రూ.ముదివేల ఆర్థిక సాయాన్ని సర్పంచి చేతులమీదుగా అందించారు.

నేరాలు - ఘోరాలు

500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు : మండల పరిధిలోని వేలేరు గ్రామంలోని తండ వద్ద సిఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో కుక్కునూరు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

జీలుగుమిల్లి : మండలంలోని రౌతుగూడెం గ్రామ శివారులో ఆదివారం కోడిపందేల స్థావరంపై దాడులు జరిపి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో వారి వద్ద నుంచి రూ.1200 నగదు, ఒక కోడి, కోడి కత్తిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ఏలూరు : గణతంత్ర వేడుకల్లో డిఐజి డివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సొంత రాజ్యాంగాన్ని రచించుకుని భారతదేశం గణతంత్ర దేశంగా మారిందని, అందుకు కృషి చేసిన వారి అడుగుజాడల్లో అందరం నడిచి దేశానికి మరింత ఖ్యాతి గడించేలా చేయాలని ఏలూరు రేంజ్ డిఐజి ఐజి జివిజి.అశోక్‌కుమార్ అన్నారు. నగరంలోని ఏలూరు రేంజ్ డిఐజి కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎఆర్ సిబ్బందికి, ఐజి కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు.

ఎస్పి క్యాంపు కార్యాలయంలో ఎస్పి ప్రతాప్‌శివకిషోర్ ఆయన సతీమణి జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సంయుక్తంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పి కార్యాలయంలో అదనపు ఎస్పి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి, పోలీసు అధికారులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు :76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశసమగ్రతా, సమైఖ్యతలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఎస్‌ఒ ఆర్‌ఎస్‌ఎస్.రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి, బిసి కార్పోరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్‌వి.నాగరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవికాదేవి, కె.భాస్కర్, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో త్రివిధ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి కూడళ్ల వద్ద మహాత్మా గాంధీ విగ్రహాల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధాన రహదారిపై జాతీయ నాయకుల వేషధారణతో విద్యార్థుల ప్రదర్శన, దేశభక్తి గేయాలకు బాలికలు చేసిన నృత్యం ఆకట్టుకుంది. పట్టణ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో, విద్యాలయాల్లో వేడుకలు నిర్వహించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో..

నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రిజిస్ట్రార్, క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం, జాతీయ జెండా ఆవిష్కరణతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఎన్‌సిసి విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫెస్ట్ పిరమిడ్ ప్రదర్శన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నిడమర్రు : నిడమర్రు ఎంపిడిఒ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎంపిపి ధనుకొండ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ విజయకుమారి పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, నగర మేయర్ షేక్ నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు జెండా ఆవిష్కరించారు. అనంతరం మహాత్మా గాంధీ, బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఎంపిపి కార్యాలయంలో ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, జెడ్‌పిహెచ్ పాఠశాలలో హెచ్‌ఎం చంద్రావతి, పి.అంకంపాలెం సచివాలయంలో ఎంపిటిసి నాలి శ్రీను ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచులు సున్నం ఉషారాణి, జగదాంబ, జగ్గారావు, ఎంఇఒ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు..

బుట్టాయగూడెం : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చలపతిరావు జెండా ఆవిష్కరించారు. మండలంలోని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, ఐటిడిఎ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

భీమడోలులో...

భీమడోలు :భారత జీవిత భీమా భీమడోలు శాటిలైట్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆ బ్రాంచ్ మేనేజర్ నిమ్మగడ్డ భువన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్‌ఐసి నిర్వహించిన పూర్తి వ్యాపారంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 156 మంది ఏజెంట్లను సత్కరిం చారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్‌ఐసి వెన్నెముకగా ఉంటుందని ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్ కూన అప్పారావు, ఏజెంట్లు రమణబాబు, సీతారాం, పివి.సత్యనారాయణ పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎంపిడిఒ పద్మావతి దేవి ఆవిష్కరించగా ముఖ్యఅతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా పాల్గొన్నారు. పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో సర్పంచి షేక్ రహీమా బేగం హసేనా పాల్గొన్నారు. వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని సర్పంచి ఆవిష్కరించారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలను వేసి నివాళులర్పించారు. చిన్నారులను తగు రీతిలో సత్కరించారు.

మండవల్లి : స్పష్టం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండవల్లి ప్రధాన సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు కొరపాటి శాంతరాజు, ఎల్ఎస్.భాస్కరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ, కార్యదర్శి కొండపల్లి రవి వరప్రసాద్, వట్టిప్రోలు సుధీర్, గోరింక గాంధీ, మెండ సురేష్, పళ్లెం సంతోష్, కొండపల్లి క్రాంతి, సంజు, చేవెళ్ల శ్రీను, కృష్ణంరాజు పాల్గొన్నారు.

ముసునూరు : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రాజ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి.పురుషోత్తమ శర్మ, పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, సొసైటీల్లో వేడుకలు నిర్వహించారు.

టి.నరసాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ టి.సాయిబాబా, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి.మణికుమారి, పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ ఎం.జయబాబులు జాతీయ జెండా ఆవిష్కరించారు. మండలంలోని అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ డిఎస్‌బి.శంకరరావు జెండా ఆవిష్కరించారు. రాజుపోతేపల్లి, తిరుమలదేవిపేట, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం హైస్కూల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి దారబోయిన లక్ష్మి, ఎంఇఒ ఎస్.కళ్యాణి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు, తోట లక్ష్మీనారాయణ, జోనుబోయిన సోంబాబు, పిఎస్.పవన్ పాల్గొన్నారు.

చాట్రాయి :ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డి.ప్రశాంతి, పోలీస్ స్టేషన్లో ఎస్ఐ డి.రామకృష్ణ, పిహెచ్‌సిలో వైద్యాధికారి బి.దుర్గాప్రసాద్ జెండా ఆవిష్కరించారు. చాట్రాయి, చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, చాట్రాయిల్లోని మెయిన్ ఎంపిపి పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. చాట్రాయి గ్రామ సచివాలయంలో సర్పంచి దామెర ఉష, బూరుగుగూడెం గ్రామ సచివాలయంలో సర్పంచి దేశ్ రెడ్డి హైమావతి జెండా ఆవిష్కరించారు.

చింతలపూడి : ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ జెండా వందన కార్యక్రమంలో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. ఆయనతో పాటు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లో ఉన్న పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి మెయిన్ సెంటర్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాల వద్ద విశ్రాంత ఉపాధ్యాయుడు జె.చంద్రమౌళీశ్వరరావు, ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు, కెకెఆర్ హ్యాపీ స్కూల్‌లో డాక్టర్ ఆనంద్‌కుమార్, ఆగిరిపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ముదినేపల్లి : మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.రామకృష్ణ, ఎంఇఒ కె.నరేష్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర దళిత సంఘాల కార్యాలయంలో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు సేవ నాగ జగన్ బాబూరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి : స్థానిక తహశీల్దార్, మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు జెంగా ఎగురవేశారు.

కుక్కునూరు:మండలంలోని పలు కార్యాలయాల్లో, పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తహశీల్దార్ రమేష్‌బాబు, ఎంపిడిఒ నరసింహారావు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు : మండల పరిషత్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. ఎంపిడిఒ శ్రీదేవి గౌరవ వందనం నిర్వహించారు. చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో తహశీల్దార్ సుమతి జెండా ఆవిష్కరించారు.

వేలేరుపాడు రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో, ఎంపిడిఒ కార్యాలయంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, సచివాలయాల్లో, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో, స్థానిక టిడిపి కార్యాలయంలో, సంత మార్కెట్‌లోని ఇందిరాగాంధీ బొమ్మ వద్ద జెండాలు ఎగురవేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. స్థానిక ఎలిజిబెత్, డాన్ బాస్కో ప్రయివేట్ స్కూల్స్ పిల్లలకు బహు వేషధారణలు వేసి స్థానిక అంబేద్కర్ సెంటర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొల్లూరి పెద బలరావు జ్ఞాపకార్థం వారి కుమారులు రామారావు, బాపిరాజు, శ్రీను పాఠశాలకు పది కుర్చీలను బహుమతిగా అందించారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

ఏలూరులో మాంసం దుకాణం

ఏలూరు సిటీ : గణతంత్ర దినోత్సవం రోజున మాంసం విక్రయాలు జరపకూడదనే ప్రభుత్వ నిబంధన ఉందని అందరికీ తెలిసిందే. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో మాత్రం ఈ నిబంధన అమలు కాలేదు. ప్రతి సారి మాదిరిగానే నిబంధనలు అతిక్రమించి ఆదివారం గణతంత్ర దినోత్సవం రోజున మాంసం దుకాణదారులు విచ్చలవిడిగా అమ్మకాలు చేపట్టారు. నగరంలో ఆదివారం మాంసం విక్రయాలను దుకాణాదారులు యథేచ్ఛగా కొనసాగించారు. గణతంత్ర దినోత్సవానికి కనీసం మూడు రోజుల ముందు నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు ఇవ్వాలి. కాని ఎక్కడా నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. నోటీసులు ఇవ్వకపోగా మాంసం విక్రయాలు జరుగుతున్న వైపు నగరపాలక సంస్థ అధికారులు కన్నెత్తైనా చూడలేదు.

ముదినేపల్లి :మండలంలోని పలు గ్రామాల్లో మాంసం విక్రయాలు యథావిధిగా కొనసాగాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాం సం విక్రయాలు జరపకూడదని నిబంధన ఉన్నప్ప టికీ కొందరు వ్యాపారులు మాత్రం దుకాణాలు తెరచి యథా విధిగా మాసం విక్రయాలు కొనసాగించారు. బహి రం గంగానే మాంసం అమ్మకాలు జరుగుతున్నప్పటికీ అధి కారులు ఎవరూ పట్టించుకోలేదు. మద్యం దుకాణాలు తెరవన్నప్పటికీ బెల్ట్ షాపుల్లో మాత్రం మందు బాబులకు ఇబ్బంది లేకుండా పెచ్చు ధరకు అమ్మకాలు జరిపారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు అందజేత

ప్రసంసాపత్రం అందుకుంటున్న జీలుగుమిల్లి సిఐ

ఉపాధి హామీ ఎపిఒ వెంకటేశ్వరరావు

అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్

వ్యవసాయ అధికారి విద్యాసాగర్



వ్యవసాయ అధికారి చాముండేశ్వరి

పురస్కారం అందుకుంటున్న విఆర్ఒ



గురజ విఆర్ఒ కిషోర్

సమాచార శాఖ ఉద్యోగి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులు సిబ్బందికి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎస్పి ప్రతాప్‌శివకిషోర్ చేతులమీదుగా ప్రశంస పత్రాలను అందించారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ ఎస్‌కె.మదీనాభాష, ఏలూరు టూటౌన్ పట్టణ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ ఎం.గౌరీదేవి, భీమడోలు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె.బాజీ, గణపవరం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పి.కాంతయ్య, కైకలూరు పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కె.రవికుమార్, నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ, పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి.రామకృష్ణ, నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్ బి.జయరాజు, ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ షేక్ షేకావత్ అలీ, నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అంపోలు వాసుదేవరావు, తడికలపూడి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బి.అనిల్‌కుమార్, చింతలపూడి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.శివాజీ, పోలవరం సర్కిల్ సిఐ పి.బాలసురేష్‌బాబు, పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్, వేలేరుపాడు పోలీస్ స్టేషన్ పిసి జె.రవిరాజు, జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ సిఐ బి.వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ టి.ఎర్రయ్య, కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి.మోహన్‌కృష్ణారావు, ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పివి.రమణ, ఏలూరు పిసిఆర్ మహిళా కానిస్టేబుల్ ఆర్‌వికె.చైతన్య, ఏలూరు సిసిఎస్ సిఐ సిహెచ్.రాజశేఖర్, ఏలూరు సిసిఎస్ ఎస్ఐ ఎ.చంద్రశేఖర్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ, డిసిఆర్‌బి ఎస్ఐ కె.రాజారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ ఎం.నాగలక్ష్మి, డిసిఆర్‌బి హెడ్ కానిస్టేబుల్ ఎస్‌వివి.సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ బి.ఆదిప్రసాద్, ఎస్ఐ ఆర్.గంగాధర్, హెడ్ కానిస్టేబుల్ ఎండి.ఇబ్రహీం, నూజివీడు హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె.మౌలాలి, ఏలూరు కానిస్టేబుల్ జి రంగారావు, భీమడోలు హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, రిజర్వ్ ఇనస్పెక్టర్ పవన్‌కుమార్, ఎఆర్ ఎస్ఐ పి.జనార్ధన్‌రెడ్డి, ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎ.భాస్కరరావు, ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ డి.రామచంద్రరావు, ఎఆర్.కానిస్టేబుల్ కె.శేఖర్, స్పెషల్ పార్టీ ఆర్‌ఎస్ఐ సిహెచ్.శివసతీష్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ డి.సూర్యకృష్ణారావు, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ విజయకుమార్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ కలీం పాషా, రేంజ్ కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న ఎండి అలీ షరీఫ్, డిటిసి పెదవేగిలో హోంగార్డుగా పనిచేస్తున్న చిన్న వెంకటేష్, జిల్లా పోలీస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నేకురి సాల్మన్, జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎం.కృష్ణకాంత్, ఐటీ కోర్ టీం ఆర్‌ఎస్.నరేంద్ర, డిటిఆర్‌బి కానిస్టేబుల్ పి.మధుసూదన్‌రావు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న ప్రతి ఒక్కరిని ఎస్పి ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.

సమాచార శాఖ సిబ్బందికి ప్రశంసాపత్రాలు

ఏలూరు : విధుల్లో ఉత్తమ సేవలందించిన సమాచార శాఖ సిబ్బందికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్.రాంబాబు, టెక్నికల్ సబార్డినేట్ ఎస్.గంగాధర్, ఫొటోగ్రాఫర్ పి.సాగర్‌లు ఉత్తమ సేవలకు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం ప్రశంసాపత్రాలు అందించారు. సిహెచ్.రాంబాబు, ఎస్.గంగాధర్, పి.సాగర్‌లను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

వ్యవసాయ శాఖాధికారులకు ప్రశంసాపత్రాలు

నూజివీడు టౌన్ : నూజివీడులో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారిణి ఎ.చాముండేశ్వరి కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఏలూరు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ప్రకాష్‌కు ఉత్తమ సేవా పురస్కారం

మండవల్లి : ఉత్తమ సేవా పురస్కార అవార్డుకు భైరవ పట్టణానికి చెందిన కోటే ప్రకాష్ ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లాలో జిల్లా స్థాయి ఉత్తమ సేవ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం అవార్డును అందుకున్నారు. కొన్నేళ్ల నుంచి బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీగా కోటి ప్రకాష్ బాల కార్మికుల విముక్తి, బాలల విద్య కోసం బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా చేసిన సేవలను మరింత అభినందిస్తూ మరింత ప్రోత్సహించే విధంగా ప్రకాష్‌ను సేవా పథకంతో అభినందించారు. భైరవ పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు .

జీలుగుమిల్లి సిఐకు ప్రశంసపత్రం

జీలుగుమిల్లి : విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా ప్రశంసపత్రం అం దుకున్నారు.

అసిస్టెంట్ ఇంజినీర్‌కు ప్రశంసాపత్రం

కొయ్యలగూడెం : మండల గృహ నిర్మాణ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఎఇ)గా విధులు నిర్వహిస్తున్న కొప్పుల మధు సతీష్ రిపబ్లిక్ డే అవార్డుకు ఎంపికయ్యారు. గృహనిర్మాణ శాఖలో ఆయన చేసిన కృషి, ప్రణాళికలు, ప్రజల కోసం అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రకటించారు. రిపబ్లిక్ డే సందర్భంగా అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. సహచర ఉద్యోగులు ఆయనను అభినందించారు.

విఆర్‌ఒ కిషోర్‌కు ప్రతిభా పురస్కారం

ముదినేపల్లి : మండలంలోని గురజ గ్రామ విఆర్‌ఒగా పని చేస్తున్న కాటూరి కిషోర్ ఏలూరులో కలెక్టర్ చేతులమీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్‌ను తహశీల్దార్ సుభాని, ఆర్ఐ రాజశేఖర్, విఆర్‌ఒలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఉపాధి హామీ ఎపిఒకు ప్రశంసాపత్రం

పోలవరం : ఎన్‌ఆర్‌ఇజిఎస్ పోలవరం ఎపిఒ వెంకటేశ్వరరావు కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

విఆర్‌ఒలకు పురస్కారాలు

ముసునూరు : మండలంలోని పలు రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒలుగా పనిచేస్తున్న పి.నవీన్, సిహెచ్.రవికాంత్‌లు ఏలూరులో కలెక్టర్ చేతులమీదుగా పరస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు నాయకులు, అధికారులు అభినందించారు.

పలువురికి ప్రశంసాపత్రాలు

ఆగిరిపల్లి : రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించినందుకు డిప్యూటీ తహశీల్దార్ జి.వవన్ కుమార్ కు, విఆర్ఒ టి.రవిశేఖర్ (చొప్పరమెట్ల), విఆర్ఎ ఎల్.శివనాగరాజుకు, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ పి.రామకృష్ణకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పిఎన్‌వి. ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది వారిని అభినందిచారు.

లారీ ఓనర్లకు రవాణా ఛార్జీలు చెల్లించాలి

చింతలపూడి :ధాన్యం రవాణా చేసిన లారీ యజమాన్లకు రవాణా ఛార్జీలు ఇవ్వాలని శ్రీ ఆంజనేయ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చింతలపూడి అధ్యక్షులు ఉక్కుర్తి నాగేశ్వరరావు కోరారు. చింతలపూడి లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2024-2025లో ప్రభుత్వ ఆదేశాల మేరకు చింతలపూడిలో లారీ ఓనరు ధాన్యం రవాణా చేశారని చెప్పారు. ప్రతి లారీ ఓనర్ వారి సొంత డబ్బులతో లోడింగ్, అన్‌లోడింగ్ చేశారని తెలిపారు. సివిల్ సప్లై అధికారులు కాని, ప్రభుత్వం కాని లారీ ఓనర్లకు ఇప్పటివరకు ఎలాంటి రవాణా ఛార్జీలు చెల్లించలేదని తెలిపారు. ధాన్యం రవాణా చేసిన డబ్బులు అందక నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టలేక, డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేక లారీ ఓనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జనవరి నెల రోడ్ ట్యాక్స్ కట్టాలని, ఏం చేయాలో తెలియక లారీ ఓనర్లు సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వం, సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ లారీ ఓనర్లకు రవాణా చేసిన ఛార్జీలను త్వరగా చెల్లించాలని కోరారు. లేకపోతే లారీ ఓనర్ల కుటుంబాలతో కలెక్టరేట్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ హర్షణీయం

ప్రజాశక్తి - కలిదిండి

నందమూరి బాలకృష్ణకు కేంద్రం పద్మ భూషణ్ అవార్డు ప్రకటించడం హర్షణీయమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో ఆయన ఆదివారం మాట్లాడుతూ 109 చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి, రాజకీయంగా పలు సేవాకార్యక్రమాలు చేస్తూ, బసవ తారకం కేన్సర్ హాస్పటల్ ఛైర్మన్‌గా రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్న బాలకృష్ణ తెలుగు ప్రజల మన్ననలు పొందారన్నారు.

కొయ్యలగూడెం : సినీ నటుడు, హిందూపురం ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటన సందర్భంగా కొయ్యలగూడెంలో పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంకు కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పోలవరం మాజీ ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు పాల్గొని కేక్ కట్ చేశారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం
2nd Additional Junior
సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 447/2023

Between:
State Bank of India, Tadepalligudem ...Plaintiff
Gujju Lakshminarayana and another ...*Defendant*

To
Gujju Lakshminarayana,
S/o. Venkateswararao,
Door No.4-150-12, Weakers Colony,
Tadepalligudem TPG JCJC

పై నెంబరు దావాలో 1వ ప్రతివాదికి ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను దావా సంగతులు తెలిసి యుండి సదరు సమన్లు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substitute of Service ద్వారా అమలు జరుపుటకు వుత్తర్వులు యిచ్చి **ది.07-02-2025వ తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున **ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

PASUPULETI SRINIVAS
Tadepalligudem — Advocate for plaintiff
Date: 20-01-2025 — Tadepalligudem